క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఎం.జయబాబు

టి.నరసాపురం: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎం.జయబాబు అన్నారు. మండలంలోని బొర్రంపాలెం హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ఉంటే వాటి ద్వారా సమర్ధవంతంగా రక్షణ పొందొచ్చన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరంపేటలో స్వచ్ఛతా హీ సేవ



సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఈవోపీఆర్డీ

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పేరంపేటలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఈవోపీఆర్డీ నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంకిపాటి కుమారి, డీపీఆర్‌సీ నాగేశ్వరరావు, ఎస్‌హెచ్‌జి సభ్యులు, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

విద్యుత్ ఈఈ రాధాకృష్ణకు సత్కారం



ఈఈ రాధాకృష్ణను సత్కరిస్తున్న ఉద్యోగులు

జంగారెడ్డిగూడెం: విద్యుత్ డివిజన్ ఈఈ పి.రాధాకృష్ణను శుక్రవారం డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఈఈగా పి.రాధాకృష్ణ సమర్ధవంతంగా సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు సీహెచ్ రాజు, సుబ్రహ్మణ్యం, టి.మురళీ మోహనరావు, సీహెచ్ శ్యామ్‌బాబు, డీఈ సుబ్బారావు, ఏఈ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ.. విద్యకు పునాది

చింతలపూడి: పిల్లల చదువులకు అంగన్‌వాడీ కేంద్రాలు పునాదులని బంజారా భజరంగీ భేరి మండల నాయకులు భూక్యా శివనాయక్ అన్నారు. బంజారా భజరంగీ భేరి ఆధ్వర్యంలో రేచర్ల గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, హెల్పర్, సంఘ నాయకులు లకావత్ శివ నాయక్, భూక్యా రమేష్ నాయక్, లకావత్ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు వెండి సమర్పణ



నూకాలమ్మ రజిత వస్త్రానికి వెండి సమర్పిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ అమ్మవారు శుక్రవారం సందర్భంగా సుందరంగా అలంకరించి, విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కల్యాణ కళావేదిక వద్ద ఉత్సవమూర్తికి పంచామృతాలు, పుణ్య నదీ జలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ నూకాలమ్మ వెండి చీర తయారీ నిమిత్తం చింతపల్లి సత్యనారాయణ, శ్రీలత దంపతులు 5 తులాల వెండిని, మాదే దుర్గాప్రసాద్, సుశీలాదేవి దంపతులు 5 తులాల వెండిని అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు పుస్తకాల అందజేత

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణం అమ్మ ప్రేమ అనాథాశ్రమంలోని చిన్నారులకు లక్కవరం గ్రామ ఫారూఖీ మసీదు కమిటీ అధ్యక్షుడు పఠాన్ అన్వర్ బాషా ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు, భోజనాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న షేక్ ముస్తఫా చేతుల మీదుగా పంపిణీ నిర్వహించినట్లు పఠాన్ అన్వర్ బాషా తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు షేక్ పకీర్ సాహెబ్, ప్రధాన కార్యదర్శి షేక్ ఇమామ్, కార్యదర్శి ఎండీ లాల్యా, కోశాధికారి నాసిర్, సభ్యులు చిన్న మస్తాన్, షాజహాన్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

వెదజల్లే పద్ధతిలో ఖర్చు తక్కువ



మెట్ట ప్రాంతంలో ఏపుగా ఎదిగిన వరి పొలం

బి.నాగకుమార్, సబ్ డివిజన్ సహాయ సంచాలకులు

చింతలపూడి: మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించొచ్చని చింతలపూడి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ అన్నారు. ఎంటీయూ 1064 రకం 10,032 ఎకరాలు, ఎంటీయూ 1061 రకం, ఎంటీయూ 1318 రకం, పీఎల్ 1100 రకం, బీపీటీ 5204 రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పిలక దశలో ఉంది. డివిజన్ పరిధిలో వెదజల్లే పద్ధతిలో కూడ రైతులు వరిసాగు చేస్తున్నారు. మెట్టలో ఎక్కువగా నారుమడులు, నాట్లు పద్ధతిలోనే సాగవుతుంది. వెదజల్లే పద్ధతిలో ఖర్చు తగ్గుతుంది. నేరుగా వెదజల్లడం వలన కలుపు బెడద ఉంటుంది. గడ్డి, కలుపు నిర్మూలనకు ప్రిటిలక్లోర్, సిఫినర్ ఎకరాకు 600 మిల్లీ లీటర్ల ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి విత్తనాలు వెదజల్లిన 3వ రోజు లోపు పిచికారీ చేయాలి లేదా బ్యూటక్లోర్ ఎకరానికి 1.2 లీటర్ల ద్రావణాన్ని 20 కేజీల పొడి ఇసుకతో కలిపి పొలమంతా సమానంగా పడేటట్లు విత్తిన 3వ రోజు లోపు చల్లాలి. విత్తిన 20 నుంచి 25 రోజుల లోపు వెడల్పాకు కలుపు సమస్య ఉంటే 3డి సోడియం సాల్ట్ పొడి మందును ఎకరాకు 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సాధారణ పద్ధతిలో సస్యరక్షణ

నాట్లు పూర్తైన పొలానికి చిరు పొట్ట దశలో వేయాల్సిన ఎరువులో నత్రజనితో పాటు మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌ను ఎకరాకు 150 నుంచి 200 కిలోల చొప్పున తప్పక వేయాలి. ఆలస్యంగా నాట్లు వేసిన, నీళ్లు నిల్వ ఉండే పల్లపు భూముల్లో జింకు ధాతు లోపం రావడానికి అవకాశం ఉంది. పంటపై జింక్ ధాతు లోపం కనిపించినప్పుడు రెండు దఫాలుగా వారం వ్యవధిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి వరిసాగు చేస్తున్న రైతులు నీటి వినియోగం మీద అవగాహన పెంచుకోవాలి. అనవసరంగా ఎక్కువగా నీటిని వాడటం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యం తగ్గడమే కాకుండా, నీరు కూడా వృథా అవుతుంది. పిలక దశలో ఒక అంగుళం, చిరుపొట్ట దశలో రెండు అంగుళాల నీటిని వినియోగించుకొని మెరుగైన దిగుబడులు సాధించాలి. సార్వాలో ముందుగా ఊడ్చిన పొలాల్లో కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు ఆశించే అశకాశం ఉంది. వీటి నివారణకు లీటరు నీటికి కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. చిరుపొట్ట దశలో ఎకరాకు కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు వేసుకోవాలి. వరిలో ప్రొఫెనోపాస్‌ను నల్లి నివారణకు కొంత మంది రైతులు పిచికారీ చేస్తున్నారని, వరిలో ప్రొఫెనోపాస్ వాడటం వలన దోమపోటు అధికం అవుతుంది. అందువల్ల ప్రొఫెనోపాస్ బదులు ఎసిఫెట్ వాడాలి. పై విధంగా సస్యరక్షణ చర్యలు, కలుపు యాజమాన్యం, నీటి యాజమాన్యం పాటించడం వలన అధిక దిగుబడులు సాధించొచ్చని ఆయన సూచించారు.

నేడు పాప ప్రక్షాళన దీక్ష



తెల్లం బాలరాజు
పోలవరం మాజీ ఎమ్మెల్యే

కొయ్యలగూడెం: పాప ప్రక్షాళన దీక్ష కార్యక్రమం శనివారం నరసన్న పాలెం సమీపంలోని వై.జంక్షన్ కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు పార్టీ శ్రేణులు హాజరు కావాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వై.జంక్షన్ నుంచి సీతంపేట వరకు పాదయాత్ర చేస్తూ నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పూజలు

లింగపాలెం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 28వ తేదీ శనివారం తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా చంద్రబాబు చేసిన వ్యాఖ్యల పాపాన్ని రాష్ట్ర ప్రజలకు తగలకుండా పాప ప్రక్షాళన కోసం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కొఠారి మోహన్‌రావు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఉదయం 9 గంటలకు లింగపాలెంలోని శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. కావున మండలంలోని ప్రతీ వైఎస్సార్‌సీపీ కుటుంబసభ్యులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: ఆటోనగర్ వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పాలాభిషేకం, అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆటోనగర్ మోటార్ ఫీల్డ్ వర్కర్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఎనీమియా నివారణ



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ద్వారకాతిరుమల: స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ మాట్లాడుతూ పౌష్టికాహారం మాసోత్సవాల నిర్వహణ ముఖ్య ఉద్దేశ్యం ఎనీమియాను అరికట్టడమేనన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను, తాజా పండ్లు, కూరగాయలను తినాలన్నారు. గర్భిణులు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మూర్తి, సెక్టార్ లోని అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యర్నం సాయికిరణ్

కుక్కునూరు: కార్మికులకు ఉరి తాడుగా మారే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం పోచారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో మెజార్టీ కోల్పోయినప్పటికీ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని చెప్పి కార్మికులకు ద్రోహం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ కోశాధికారి సుజాత, సహాయ కార్యదర్శి కాకర్ల శ్రీను, సభ్యులు శ్రావణి, గ్రేసీ, పద్మ, దుర్గమ్మ, రమణ, భవాని, బాపనమ్మ, చందు, ఇరకం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసుధా ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న సురేష్

బుట్టాయగూడెం: సమాజంలో నిమ్నజాతులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా జ్యోతీబా పూలే, సావిత్రిబాయి పూలే పోరాటాలు చేశారని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు ధర్ముల సురేష్ అన్నారు. సత్యసుధా సమాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దొరమామిడిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు కావొస్తున్నా నేటికీ ఆదివాసీలు, దళితులపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వడ్లమూడి వెంకటేశ్వరరావు, కారం రాఘవ, కెచ్చెల పోతిరెడ్డి, తగరం బాబూరావు, కొమరం నాగార్జున, మడివి మురళి, కడిమి సురేష్, దువ్వెల గంగరాజు, మాల్చి నాగన్న, గోగుల సుధాకర్, కరకాల ప్రతాప్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



కామవరపు కోట: జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



జంగారెడ్డిగూడెం: పోటీల్లో ఎంపికైన విద్యార్థులు

కామవరపుకోట: జిల్లా స్థాయి పోటీలకు కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గస్ బాబు తెలిపారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు 40 మంది విద్యార్థిని విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్‌లో విద్యార్థులు సత్తా చాటారు. మండల కో-ఆర్డినేటర్, పీడీ ఎల్.జయరాజు మాట్లాడుతూ 26, 27 తేదీల్లో స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ (ఎస్‌జీఎఫ్) సెలక్షన్స్ చింతలపూడి నియోజకవర్గ స్థాయి ఎంపికలు శుక్రవారంతో పూర్తయ్యాయన్నారు. తొలి రోజు నిర్వహించిన క్రీడల్లో 270 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో ఏలూరులో జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో పాల్గొంటారని తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ఇఫ్టూ నాయకులు

జంగారెడ్డిగూడెం: ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఇఫ్టూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయ అధికారికి వివిధ రైతాంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు సాలి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం నష్టపోయిన అన్ని ప్రధాన పంటలకు గిట్టు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి సముద్రాల సుందరరావు, సహాయ కార్యదర్శి కాశీబాబు, ఇఫ్టూ జిల్లా కమిటీ సభ్యులు బత్తుల బాబూరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డి.అప్పలస్వామి, టి.ఆనంద్, పాల్గొన్నారు.

రైతుల రుణాలు మాఫీ చేయాలి




సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతున్న దేగ ప్రభాకర్

కొయ్యలగూడెం: కేంద్ర ప్రభుత్వం రైతులకు సంబంధించి పంటల బీమా పథకం అమలు చేసి, రైతుల రుణాలు మాఫీ చేసి రైతాంగాన్ని కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కన్నాపురం రోడ్డులోని సీపీఐ కార్యాలయంలోమండల ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో 60 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం వ్యవసాయ రంగంలో ప్రతీ 45 నిమిషాలకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులను, వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి స్వామినాథన్ కమిషన్ సిఫారసులు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణంతో పాటు, నిర్వాసితుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని నిర్వాసిత గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, గుదే శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. ఎస్సై జబీర్ తెలిపిన వివరాల ప్రకారం దిప్పకాయలపాడుకు చెందిన పదిలం సురేష్ ద్విచక్ర వాహనంపై ఈ నెల 25న అత్తగారి ఊరైన రామచంద్రాపురం వచ్చి తిరిగి వెళుతుండగా, ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీ కొందన్నారు. ఈ ఘటనలో గాయపడిన సురేష్‌ను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, బాధితుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎంవీఐ బాధ్యతల స్వీకరణ



ఎంవీఐ ఎస్ఎస్ రంగనాయకులు

జంగారెడ్డిగూడెం: మోటార్ వెహికల్ ఇనెస్పెక్టర్ (ఎంవీఐ)గా ఎస్ఎస్ రంగనాయకులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన కేవీఎస్ ప్రసాద్ కొవ్వూరు బదిలీ కాగా, సాధారణ బదిలీల్లో భాగంగా రాజమండ్రి నుంచి ఎస్ఎస్ రంగనాయకులు ఇక్కడకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ పత్రాలు ఉండాలన్నారు. వాహనదారులకు ఏ సమస్య వచ్చినా నేరుగా తనను కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు.

రేపు శాస్త్రీయ సంగీత కచేరి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శాస్త్రీయ సంగీత కచేరి ఏర్పాటు చేసినట్లు ఆ సంఘ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వర రావు తెలిపారు. సాయంత్రం 6.15 గంటలకు స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. విజయవాడకు చెందిన శాస్త్రీయ సంగీతంలో విశిష్టులైన మల్లాది కుటుంబ వారసులు మాస్టర్ మల్లాది శివానంద యశస్వి గాత్ర ఆలాపనతో, కుమారి మల్లాది సింధు రాగేశ్వరి వయోలిన్ సహకారంతో మల్లాది అరవింద్ కార్తీక్ మృదంగం వాయిద్య సహకారంతో ఈ శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేబీస్ ప్రాణాంతక వ్యాధి



బీఆర్ శ్రీనివాసన్, పశువైద్యాధికారి

జంగారెడ్డిగూడెం: రేబీస్ అనేది ఒక ప్రాణాంతక జూనోటిక్ వ్యాధి, ఇది జంతువుల నుంచి మనుషులకు సంక్రమిస్తుంది. ముఖ్యంగా కుక్కలు, పిల్లుల్లో రేబీస్ వైరస్ ఉంటుంది. ఈ వ్యాధి ఏసెఫాలైటిస్ (గుర్తింపు లోపం), మానసిక స్థితి మార్పులకు దారి తీస్తుంది. ఇది చివరకు ప్రాణాంతకం అవుతుంది. నేడు (సెప్టెంబర్ 28) ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా వ్యాప్తి, నివారణ చర్యలపై పశువైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ కుక్కలు, పిల్లుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వాటికి తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. అవి కరిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి రేబీస్ వ్యాధి వ్యాప్తిని నిరోధించాలని ఆయన సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం శివారులో శుక్రవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 11 మంది జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.15 వేల నగదు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

కర పత్రాల ఆవిష్కరణ



మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి 21వ దసరా మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శుక్రవారం దసరా శరన్నవరాత్రుల కరపత్రిక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు టీవీపీ రామ తారకం అధ్యక్షతన కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రులు అక్టోబర్ 03 నుంచి 12 వరకు నిర్వహిస్తున్నట్లు రామతారకం తెలిపారు. కార్యక్రమంలో కర్పూరం జనార్ధన్, మహంకాళి రామమోహనరావు, మాతు రాజా, శీమకుర్తి శ్రీను, చిన్ని రామ సత్యనారాయణ, పసుమర్తి సాయి, గుళ్లపూడి శ్రీను, ఇమ్మడి బాలభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

108 వాహనానికి సుస్తీ

- వాహనానికి ఊడిపోతున్న డోర్లు
- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం



బుట్టాయగూడెం 108 వాహనానికి డోర్లు ఊడిపోయిన దృశ్యం

బుట్టాయగూడెం: స్థానిక 108 వాహనానికి అపదొచ్చింది. కనీసం కండిషన్ పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటుంది. 2020లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 108 వాహనాన్ని బుట్టాయగూడెం మండలానికి కేటాయించింది. అప్పటి నుంచి దాదాపు 70 వేలకు పైగా సేవలు అందించిన ఈ వాహనం ప్రస్తుతం పూర్తిగా కండిషన్ దెబ్బతిని కుయ్ కుయ్ అంటూ పరుగులు తీయడం కష్టంగా మారింది. వాహనానికి ఎడమ వైపు ఉన్న డోర్లు పూర్తిగా పాడైపోయాయి. ఈ వాహనంలో అత్యవసర సమయంలో రోగులను తరలించే సమయంలో డోర్లు ఊడిపోయే పరిస్థితి కూడా నెలకొంటుంది. అయితే సిబ్బంది డోర్లకు తాళ్లు కట్టి సేవలందిస్తున్న పరిస్థితి నెలకొంది. అలాగే బ్రేక్‌లు కూడా సక్రమంగా పడటం లేదని చెబుతున్నారు. అలాగే ఇటీవల వాహనం మరమ్మతులకు రావడంతో సుమారు 15 రోజుల వరకూ సేవలు నిలిచిపోయాయి. అయితే సిబ్బంది జంగారెడ్డిగూడెంలో తాత్కాలిక మరమ్మతులు చేయించడంతో మళ్లీ తిరిగి సేవలందిస్తున్నారు. గత నాలుగేళ్లుగా గిరిజన ప్రాంతంలోని మారుమూల గ్రామాలైన గోగుమిల్లి, ముంజులూరు, చింతపల్లి, పులిరామన్నగూడెం, రామనర్సాపురం, రెడ్డిగూడెం వంటి మారుమూల గ్రామాల్లో సైతం ఎన్నో సేవలు అందించిన ఈ 108 వాహనం మరమ్మతులకు వచ్చినప్పటికీ కనీసం పట్టించుకునే నాథుడు కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వాహన మరమ్మతులు చేయించి మండలంలో అత్యవసర సేవలు అందించే విధంగా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

కోవిడ్ సమయంలో 108 వాహన సేవలు భేష్

కోవిడ్ సమయంలో కోవిడ్ కేసులు నమోదై కనీసం ఆ పేషెంట్‌ల వద్దకు వెళ్లలేని పరిస్థితులు గల రోజులవి. ఆ సమయంలో 108 వాహన సేవలు మరువలేనివిగా నిలిచాయి. బుట్టాయగూడెంలో కేటాయించిన 108 వాహనం ఒక్కటే సుమారు 2000 పైగా కేసులకు సేవలందించింది. అత్యవసరంగా ప్రమాదంలో ఉన్న వారిని గిరిజన ప్రాంతంలోనే కాకుండా ఏలూరు, విజయవాడ, రాజమండ్రి వంటి పట్టణాలకు కూడా త్వరితగతిన పేషెంట్‌లను తీసుకెళ్లి సకాలంలో వైద్యసేవలు అందించేలా కృషి చేశారు. అయితే ప్రస్తుతం వాహన పరిస్థితి బాగోకపోవడంతో కనీస స్పీడ్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు.

గిరిజన యువతికి అవార్డు



అవార్డు అందుకుంటున్న రేణుక

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల కుగ్రామానికి చెందిన ఒక గిరిజన యువతి బెస్ట్ మోటివేషన్ అవార్డు అందుకుని అందరికీ ఆదర్శంగా నిలిచింది. జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే పట్టుదల, కృషి అవసరమని ఆ దిశగానే తాను అడుగులు వేసి హైదరాబాద్‌లో మోటివేషన్ కోర్సులో బెస్ట్‌గా నిలిచానని రేణుక తెలిపింది. బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెంకు చెందిన కొవ్వాసి బుచ్చిరాజు, వెంకాయమ్మ దంపతుల మొదటి కుమార్తె రేణుక పదో తరగతి వరకూ గ్రామంలోనే చదువుకుంది. ఇంటర్మీడియట్ నుంచి బీఎస్సీ ఫిషరీష్ వరకు చదువుకుంది. ప్రస్తుతం ఆమె చెన్నైలోని ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్ఓగా పని చేస్తుంది. నవ భారత నిర్మాణానికి రాళ్లెత్తే కూలీలం మేము అనే నినాదంతో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ మోటివేషన్ కోర్సు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 60 మందికి మోటివేషన్ కార్యక్రమం నిర్వహించగా ఇందులో పాల్గొన్న తనకు బెస్ట్ మోటివేషన్ ట్రైనర్ అవార్డు వచ్చిందని చెప్పింది.